

# బఫెల్లోస్ క్లబ్

డా॥ వి. చంద్రశేఖరరావు

బర్రె శవం! పొట్ట బాగా ఉబ్బి ఉంది! చర్మం నెర్రెలు నెర్రెలుగా చిట్లి, అందులోంచి కారిన రక్తం గడ్డకట్టి నల్లగా, నీలనీలంగా, కళ్లు తెరుచుకొనే ఉన్నాయి. కనుగుడ్లు చీలి ఉన్నాయి. కళ్ల చుట్టూ రక్తము, పల్చటి సొన గడ్డకట్టి.

ముట్టి బిగుసుకుపోయి ఉంది. పళ్లు బయటకు పొడుచుకొని వచ్చాయి. పళ్ల చుట్టూ రక్తం ఎండిపోయి ఉంది.

బర్రె శవం అట్లా గాలిలో వేళ్లాడుతోంది!

ఏ క్షణంలోనైనా పైనబడుతుందేమోనని భయం!

ఉలిక్కిపడి నిద్రలేచాను.

రాత్రంతా ఇట్లాంటి పీడకలలే!

నిర్జనమైన వీధులు, తగలబడుతున్న ఇళ్లు. భయంతో పరిగెత్తుతున్న జనం- కెమెరాలో స్నాప్ షాట్స్‌లా వెంటాడుతూనే ఉన్నాయి!

పంజరంలో చిలుక శవం, తెగిపడిన ఒంటరితల నెత్తిపై టప్‌టప్‌మని జారిపడుతున్న రక్తపు బొట్టు.

నరకం చూశాను!

రోజు మొదలైంది!

కాఫీ తాగుతూ, తాపీగా పేపరు చదువుకుంటున్న మాలతి.

''నిద్ర సరిగ్గా పట్టలేదా?'' మాలతి. ''త్వరగా తయారవ్వండి! నాలుగు మైళ్ల నడక!''

నేనేం మాట్లాడలేదు.

కాఫీ తెచ్చి ఇస్తూ, ''బసవన్నపాలెం ఒక నిజం, సుబ్బమ్మ ఒక నిజం, పగిలిన తల, కూలిపోయిన గుడిసె, బర్రె శవం కూడా నిజాలే! మనమొట్టి ప్రేక్షకులం అనే మాట కూడా నిజం!''

మామూలుగా ఉండటానికి ప్రయత్నిస్తూ, ''మన ఎండీఓ కూడా ఎస్సీనట కదా!'' అన్నాను.

''ఏమో ఆయనెప్పుడూ తెర తీయలేదు! నేను లోంచి చూడలేదు! అయినా మన యుద్ధభూముల్లో హీరోలుండరు, కవర్డ్స్, అంతటా పిరికివాళ్లే!'' మాలతి.

''ఎవరి గురించి చెబుతున్నావు?''

''మన గురించే! మనమొట్టి తోలుబొమ్మలం! వెనకెవడో తాడు లాగుతుంటాడు! రక్తపు మడుగులన్నింటి మీదా మన వేలిముద్రలుంటాయి! అయినా నోరెత్తము! రాత్రులు మాత్రం పీడకలలు తెచ్చుకొని ఉలికిపాటుతో గడుపుతుంటాము!''

మాలతి ముఖం ఎర్రగా అయింది!

''ఒక దళిత మహిళా సర్పంచిపై దాడి జరిగితే దాని ఊసే జనానికి పట్టదు. ఆ వార్త పేపర్లలో చేరదు. పోలీసులకు తెలియదు! రాత్రికి రాత్రి కప్పిపెట్టిన శవంలా! నేలను చదునుచేసి ఏమీ జరగలేదని నమ్మించడానికి ఈ లంజ వేషాలు! మండల్ సిబ్బంది మొత్తం కట్టకట్టుకు వెళ్లి ఆగస్టు పదిహేను జరపటం, దానికో ఎమ్మెల్లే సాక్షి!''

''ఆరు నెలల నుంచీ సుబ్బమ్మ మొత్తుకుంటూనే ఉంది! పంచాయితీ ఆఫీసుకెళితే కుర్చీలో కూర్చోకూడదు, నేలపైనే. పేరు పెట్టి కూడా పిలవరు! ఒసే అనో కోపమొస్తే లంజా అనో పిలుస్తారట! వేలుముద్రల మిషన్‌లాగా, ఏం జరుగుతుందోచెప్పరు. కళ్లకు గంతలు గట్టి, వచ్చిన గ్రాంటంతా జేబుల్లో వేసుకుంటారు! 'సంవత్సరమైంది, మాదిగపల్లెకు ఒక బోరింగ్ వేయించుకోలేకపొయ్యాను!' అని వాపోతుంది.''

"ఎండీఓకి అర్జీ రాసిస్తే, అందులోని విషయాలు మరిచిపోయి, ఎవరు నీకు అర్జీ రాసిచ్చారు అంటూ కూపీ లాగుతాడు. కలెక్టరు దగ్గరకు వెళితే, 'ఇది మీ ఊరి స్వంత విషయం! ఐ యామ్ హెల్ప్‌లెస్!' అంటా డట! ఈ బ్యూరోక్రసీ మొత్తాన్నీ తగలబెట్టినా పాపం లేదు!"

"సూపరెండెంటుగారూ!" బయట బంట్రోతు పిలుపు! "అందరూ మీ కోసం ఎదురుచూస్తున్నారు!"

ఇద్దరం బయల్దేరాము. మాతోపాటు నలుగురు యూడీసీలు, ఇద్దరు బంట్రోతులు, రిటైరు కావడానికి సిద్ధంగా ఉన్న సీనియర్ సూపరెండెంటు, ఎండీఓ, ఈఓలు వారి వందిమాగధులు జీపుల్లో బయలుదేరారు. మిగిలిన వాళ్లంతా కాలి నడకన.

చేలన్నీ పుగాకుపంటలే! పెద్ద సైజుకు పెరిగిన కాన్సర్ క్రిమిలా విశాలంగా విప్పారిన ఆకులు. వెగటు వాసన! చేల మధ్యన పుగాకు బారన్‌లు. మగ్గబడుతున్న పుగాకులోంచి ఎగిసివస్తున్న నికోటిన్ వాసనలు. బారన్‌ల పక్కనే పొడవాటి పాకలు. అందులో గ్రేడింగ్ చేస్తున్న ఆడవాళ్లు.

పల్చటి ఉదయపు ఎండ. మబ్బులు కప్పిన ఆకాశం. కాలిబాటన మాకెదురౌతున్నారు ఊరి ఆడ వాళ్లు, పుగాకు గ్రేడింగ్ కోసం బయల్దేరినివాళ్లు. చేతుల్లో స్టీలు కారేజీలు, మానవ జీబ్రాల్లా వేగంగా నడుస్తున్నారు.

'అమ్మాయా! నరం ఇంజక్షన్ ఇత్తావా! కాళ్లు ఒకటే లాగుతున్నాయి!" మాలతిని బాటలోనే ఆపింది ముస లమ్మ.

"సాయంకాలం ఇంటికొస్తాన్లే! మందులేమీ తేలేదు!" హెల్త్ వర్కర్ (దావా)గా వాళ్లకు బాగా సన్ని హితం మాలతి.

"సుబ్బమ్మగారు ఊళ్లోనే ఉన్నారా?"

"సుబ్బమ్మ ఉంది! బర్రె శవం కూడా ఉంది! మీరు మద్దిపాడు నుంచి లాక్కొచ్చిన పిల్లకాయలు కూడా ఉన్నారు. పొయ్యి ఆ తమాషాలన్నీ చూడండి!" నడికారు ఆడమనిషి కోపంతో అరిచింది.

*

ముఖాలపై హడావుడిగా పూసుకొచ్చిన ఉత్సా హం. కనురెప్పలే లేనట్లుగా కళ్లను తెరిచి ఉంచుకొని, శరీరాన్ని భూమిలో పాతుకొని గాజుబొమ్మల్లా నిలబడ్డ- వందకు పైగా ఉన్న స్కూలు పిల్లలు.

రంగు కాగితాలు, మైకుల్లో పాటలు, రెక్కలురాని పక్షిలా ఎగరని జాతీయ జెండా, ఉదయం ఎనిమిది నుంచీ అట్లాగే నిలబడ్డారు వాళ్లు. కాళ్లు భూమిలోకి దిగబడ్డట్టుగా, అసలు కాళ్లే లేనట్లుగా.

ముఖాలపై ఉత్సాహాన్ని పూయడానికి ప్రయత్ని స్తున్నారు అయ్యవార్లు.

ఒంగోలు నుండి ఖద్దరు ఆసామి రావాలి! అప్పుడే జెండా రెక్కలు విప్పుతుంది. అప్పటిదాకా పిల్లలకా కష్టాలు తప్పవు.

"నువ్వెళ్లి ఆ సుబ్బమ్మ సంగతి చూడ్రాదూ?" ఎండీఓ టెన్షన్‌గా అన్నాడు.

"ఏమిటి సంగతి?" తాపీగా అడిగాను.

"ముసిల్దాని గేదె చచ్చిపొయ్యిందట!"

"నేను వెళ్లి పోస్టుమార్టం చెయ్యాలా?" విసుగ్గా అన్నాను.

"ఇన్-సబార్డినేషన్! ఇన్-సబార్డినేషన్," అని గొణుక్కుంటూ ఎండీఓ వెళ్లిపోయాడు.

పిల్లల ముఖాలపై ఉత్సాహం ఇంకా కరిగి పోలేదు. ఖద్దరు ఆసామి ముందు చెయ్యాల్సిన ఫీట్లు పదేపదే ప్రాక్టీసు చేస్తున్నారు. వలయాలు వలయాలుగా చీలి- అది డ్యాన్స్ బాలే.

హార్మోనియం, తబలా, వేణువు, నీరసం కలగలిపి ఒక పాటను వండుతున్నారు.

చిలుకతో సర్కస్ ఫీట్సు- స్టార్ అట్రాక్షన్ అదే! స్కూలు కుర్రాడే చిలుకను ఎట్లా ట్రైన్ చేశాడోగాని- గొప్పగా ఫీట్సు చేస్తుంది.

చిలుక ఒంటినిండా రంగుల్ని పెయింట్ చేశాడు. మూడు రంగుల జాతీయ జెండాకు నకలుగా- సన్నని ఇనుపసువ్వలతో చేసిన పంజరం. లోపల రెక్కలు టపటపలాడిస్తూ రంగుల చిలుక- పెయింటెడ్ బర్డ్!

"ఎగరాలి! నాంచారీ! ఎగరాలి!" కుర్రాడు దాన్ని ఉత్సాహపరుస్తున్నాడు. ఆ ఉత్సాహంతో అది పంజరం తోపాటు గాల్లో ఎగురుతుంది. గొప్ప దృశ్యం! ఎగిరి ఎగిరి దబ్బున నేలపై పడింది! చిలుక నోటినిండా రక్తం! వాడు దాన్ని బయటకు దీసి, రక్తాన్ని తుడిసి, కాసిన్ని నీళ్లు పెట్టి, గింజలు పెట్టి- మళ్లీ ఉత్సాహ పరుస్తున్నాడు.

"నువ్వా సుబ్బమ్మ సంగతి చూడ్రా బాబు!"

ఎండీఓ మళ్లీ నస మొదలుపెట్టాడు. "లేడీ సర్పంచ్! అందునా ఎస్సీ! ఇష్యూ, రైజ్ అవకుండా ఏదోలా సరిజెయ్యి! నేనా మాజీ సర్పంచ్‌తోటి, మిగిలిన కౌన్సిలర్లతోటి మాట్లాడతాను. గొడవలేమీ కాకుండా చూడ్రాబాబు!" అతని ముఖంపై కంగారు, చెమటలు.

కుర్రాడు మళ్లీ చిలుకను ఉత్సాహపరుస్తున్నాడు. "ఎగరాలీ నాంచారీ, ఎగరాలి!" అంటూ.

పక్కనే చావు వాసన! శవం నడిచి వస్తున్న అను భూతి! యుద్ధకాలంనాటి కవాతు. భూగోళాన్ని తాడుతో లాగుతున్నట్లుగా బరాబరా శబ్దం! మురుగు వాసన కాదు మరణపు వాసన! కుళ్లి పెనుకంపులా మారిన వాసన! బరాబరా శబ్దం దగ్గరవుతుంది. వాసనకు తాడుకట్టి లాగుతున్నట్టు! వాళ్లేభయిమంది దాకా వుంటారు. పొగలు పొగలుగా చీకటి కమ్ముకొస్తున్నట్లుగా, గుంపుగా వస్తున్నారు. అందరూ ఆడవాళ్లే, అందునా ముసలివాళ్లే! ప్రాణాల్ని మోసుకొస్తున్నంత భద్రంగా వాళ్లు మోసు కొచ్చేది బర్రె శవం!

పంచాయితీ ఆఫీసు ముందు బర్రె శవం!

కుళ్లి, ఉబ్బి, దుర్గంధపు మూటలా ఉన్న బర్రె శవం!

''లంజముండల్లారా! ఏమిటే ఇది?'' మాజీ సర్పంచ్ రంగారావు పెద్దగా కేకలు వేసుకుంటూ వచ్చాడు. ముందుగా తేరుకుంది అతనే! మిగిలిన వాళ్లంతా బొమ్మల్లా చూస్తున్నారు.

''నోరులేని జీవం అది! నా బట్టలారా! దాని జోలి మీకేం వచ్చింది! ముండమోపి జెండా ఎగరేస్తాననన్దు దుకు ఇంత జేస్తారా! అడిగే దిక్కు లేదనా మీ యిష్టం వచ్చినట్లు చేస్తన్నారు! ఒంగోలు నుంచి ఆడెవడో వస్తన్నా డుగా, ఎమ్మెల్లే అని, ఆ నా బట్టనే అడుగుతాను. ఈ బర్రెగొడ్డునెందుకు చంపాల్సి వచ్చిందో చెప్పమని!''

ఫట్‌మంటూ సుబ్బమ్మ మూతిపై కొట్టాడు రంగా రావు. మూతినిండా రక్తం! దుబ్బుమని నేలపై పడింది! కిందబడినదాన్ని అట్లాగే కాలితో తన్నాడు. ''వామ్మో! నాయనో! ఓ సుబ్బమ్మత్తో!'' ఒక్కసారిగా గొల్లుమన్నారు ఆడవాళ్లు. రంగారావును పక్కకు దోసి, సుబ్బమ్మ చుట్టూ మూగారు. ''చంపరా. నా బట్టా చంపు! నా సాడు బొయ్య! నీ దినం జెయ్య!'' సుబ్బమ్మ పెద్దపెద్దగా అరు స్తుంది! సుబ్బమ్మను నడిపించుకుంటూ వాళ్లు పల్లె వైపునకు వెళ్లారు.

ఎదురుగా శవం!

స్కూలు పిల్లలందరూ భయంతో దూరం జరిగారు!

చిలుకా, పంజరం, కుర్రాడు ఎటో ఎగిరి పొయ్యారు!

ఎండీఓ ముఖంలో కంగారు! ''ఒరేయ్! వెట్టివాళ్లె వరైనా దొరుకుతారేమో చూడండిరా!'' రంగారావు అరు స్తున్నాడు. ఎవరూ రారని అతనికి బాగా తెలుసు.

భీతిల్లిన ముఖంతో అటూ ఇటూ తిరుగు తున్నాడు ఎండీఓ.

''హెడ్ మాస్టరెక్కడున్నాడో చూడండి! పిల్లల్ని బెట్టి దాన్ని కాస్త దూరంగా లాగించండి!'' హెడ్ మాస్టరు కనబడలేదు. పిల్లలు అయిష్టంగా దూరంగా జరిగారు.

శవం కదల్లేదు!

ఎండీఓ ముఖం ఆకులురాలిన అడవిలా ఉంది. తూటా దెబ్బ తిని గిలగిలలాడుతున్నట్లుగా ఉంది.

''ఇదుగో సూపరెండెంటూ! మన సమితి ఆఫీసు స్టాఫునంతా పిలవండి! బర్రెను లాగి వెయ్యమనండి! ఎమ్మెల్లేగారు వచ్చే టైము అయింది!''

స్టాఫ్ వైపు నుండి రెస్పాన్స్ లేదు.

శవం కదల్లేదు!

''ఇది నా ఆర్డర్! కాదంటే డిసిప్లినరీ ఏక్షన్ తీసు కుంటాను!'' ఎండీఓ గొంతులో అసమర్థుని కోపం!

నసుక్కుంటూ, తిట్టుకుంటూ బ్యూరోక్రసీ అంతా కదిలింది!

ముక్కులతో ముఖాన్ని కప్పుకొని, కులవ్యవస్థ అంత బరువైన కుళ్లిన శవాన్ని లాగుతూ, లాగుతూ...

''ఏవమ్మా! నువ్వేమిటి అట్లా నిలబడ్డావు! నీకు వేరే చెప్పాలా?'' మాలతి నుద్దేశించి అరుస్తున్నాడు ఎండీఓ.

''ఇది నా డ్యూటీ కాదు! నేను చెయ్యను!''

''హెల్త్‌వర్కర్‌వి కదా! నీ డ్యూటీ కాదంటా వేమిటి?''

''ముందు మీ డ్యూటీ చెయ్యండి! పంచనామా రాయించండి! ఒక ఎస్సీ మహిళా సర్పంచిని ఇంత మంది ముందు అవమానించి కొట్టినందుకు కలెక్టరుకు రిపోర్టు ఇవ్వండి! ఆ తరువాత నా డ్యూటీ చేస్తాను!''

''చాలా ఎక్కువ మాట్లాడుతున్నావు! నీ లిమిట్స్ లో ఉండు! నీకు మెమో ఇస్తున్నాను!''

మాలతి నిర్భయంగా చూస్తుంది!

కళేబరం కదుల్తుంది! కుళ్లిన మాంసాన్ని పొర్లిస్తు న్నట్లుగా.

బరబరా లాగుతూ, పీనుగుల గుట్టను ఈడుస్తు న్నట్లుగా ఈడుస్తూ.

దూరంగా మాలతి!

ఎత్తయిన కొండలా!

కుళ్లినది బర్రె శవం మాత్రమేనా? నా లోపల నుంచి కూడా ఒక నీచు వాసన వేస్తూ...

*

ఖద్దరు ఆసామీ వస్తున్నట్టు కబురు వచ్చింది!

పిల్లవాళ్లు మళ్లీ రిహార్సల్ మొదలుపెట్టారు.

''ఎగరాలీ! నాంచారీ! ఎగరాలి!'' కుర్రాడు చిలుకను మళ్లీ ఉత్సాహపరుస్తున్నాడు!

రెక్కలు విప్పడానికి సిద్ధంగా ఉన్న జెండా!

రీ మేకింగ్ ఆఫ్ ఎ సీన్!

*

నడిచీ నడిచీ పుగాకు చేల మధ్య ముగింపులేని ప్రయాణంలా ఉంది. చేలల్లోంచి నికోటిన్ వాసన మత్తుగా ముక్కులకు తాకుతుంది. ఆకుల మధ్య అట్లాగే పడిపోయి మత్తుగా పడుకోవాలనే కోరిక! జీపుల, కార్ల శబ్దం క్రమంగా చెవులను దాటుతుంది! కళ్లు తిరుగుతున్నట్లు ఉంది! వాంతి అయ్యేలా ఉంది! కళ్లు తిరగడం ఎక్కువయి అట్లాగే పొలం గట్లపై కూలబడ్డాను. తల ముక్కలైపోతున్నట్లుగా ఉంది! కళ్ల ముందంతా రక్తం! చేల పొడవునా, గట్ల పొడవునా, సుబ్బమ్మ తల లోంచి కారిన రక్తం! నన్ను వెంటాడుతున్నట్టుగా ఉంది. ఆకుపచ్చని పొలాలు. నీలాకాశం అంతా ఎరుపుగా మారాయి! కలర్ బ్లైండ్‌నెస్సా, హెల్యూజినేషనా, ఓపిక తెచ్చుకొని, 'మీరు వెళ్లండి!' మిగిలిన వాళ్లకు సైగచేశాను.

చెవుల్లో ఒక కేక, అరుపు, ఒక అవమానం, ఇదీ హెల్యూజినేషనా? సుబ్బమ్మపై జరిగిన అవమానాన్ని నేనెందుకు ఖండించలేదు? ఒక ప్రశ్న! మళ్లీ మళ్లీ అదే ప్రశ్న! బర్రె శవమంత బరువైనదిగా, మోయలేనట్లుగా ఈ ప్రశ్న!

బారన్ల దగ్గర కలకలం! ఎవరో పనిషి పొయ్యిలో చేతులు పెట్టాడని, చేతులు కాలిన మనిషి ఒకటే గొడవ!

''సుబ్బమ్మ మొగుడు సామేలుకు ఇట్లాగే బారన్ల పొయ్యిలో కాల్చారట వాళ్లు! పొయ్యిలో వేడి సరిగ్గా చూడక, లోపల ఆకులన్నీ మాడిపొయ్యాయట! వేలల్లో నష్టం వచ్చిందంటూ రెండు చేతుల్ని పొయ్యిలో పెట్టి- కాలి బొబ్బలెక్కి- ఆ కమురువాసన పల్లెను రోజుల తరబడి వెంటాడిందట! కాలిన చేతులకు వైద్యం లేక సెప్టిక్ అయ్యి చచ్చిపొయ్యాడు!'' మాలతి విషయాలు చెబుతుంది!

కాలిన శరీరపు కమురు వాసన ముక్కులకు తగులుతుంది!

మాలతీ! నా మెదడుకేమైంది! శబ్దాలు, రంగులు, వాసనలు అన్నీ మారిపోతున్నాయి! నా మెదడుకు జబ్బు చేసింది!

''అమ్మో! నాయనో!'' కాలినవాడి అరుపులు వెంటాడుతున్నాయి!

చేలగట్లపై తడితడిగా ఎర్రగా రక్తం! కాళ్లు, చెప్పులూ తడిసి, ''ఏదయినా కుంట కనబడితే ఆగుదాం! కాళ్లు కడుక్కుందాం!''

మాలతి ఆశ్చర్యంగా చూసింది. ''ఏమైంది కాళ్లకు?''

''రక్తం! రక్తం!'' పెద్దగా అరవాలని ప్రయత్నం! సాధ్యం కాలేదు!

పొలాలు క్రమంగా అదృశ్యమవుతున్నాయి! నల్లనల్లగా మెరుస్తున్న రోడ్డు! రోడ్డుపైకి చేరితే, ఏ లారీనో, బస్సో దొరికితే ఆశగా అటు నడిచాము.

రోడ్డు ఒంటరిగా ఉంది. ఏళ్ల తరబడి ఏ వాహనాన్ని చూడనట్టుగా ఉంది. ''ఇది మెయిన్ రోడ్డు కాదనుకుంటాను!'' మాలతి గొణిగింది! రోడ్డు పక్కనే పెద్ద అడ్వర్‌టైజ్‌మెంట్ బోర్డు. బోర్డు మధ్యలో 'బర్రెతల' నల్లగా, ఆరోగ్యంగా మిలమిలలాడుతూ. దానికింద 'బఫెల్లోక్లబ్' అని పెద్ద అక్షరాల్లో రాసి ఉంది.

'ఆరోగ్యానికీ, బలవర్ధకమైన ఆహారానికీ బఫెల్లో క్లబ్‌ను దర్శించండి! ఇది ప్రభుత్వ యాజమాన్య సంస్థ!' అని రాసుంది. పొడవాటి యారో మార్కు కుడివైపునకు చూపిస్తూ.

రోడ్డుపై నిర్మానుష్యం. పుగాకు గ్రేడింగ్ కంపెనీల పక్కన పుగాకు బేళ్లు పర్వతాల్లా పేర్చి వున్నాయి. పొడవాటి షెడ్డు ముందు 'బఫెల్లోస్ క్లబ్' అంటూ బోర్డు. బోర్డుపై నల్లగా మిలమిలలాడే బఫెల్లో తల!

''లోపలికెళదాం! కాఫీ దొరుకుతుందేమో?'' అంటూ మాలతితోపాటు నడిచాను. విశాలమైన హాలు! పల్చటి వెలుతురు. పాతిక పైగా టేబుళ్లు. చుట్టూ సొగసైన కుర్చీలు! టేబుళ్లపై పల్చటి వెలుతురు చిమ్మే ఫోకస్ లైట్లు! టేబుల్స్‌పై ఎర్రటి ప్లేట్లు. రక్తంతో చేసినట్లుగా. ఉలిక్కిపడ్డాను. స్టీరియోలోంచి వినబడే ఇంగ్లీషు పాట క్రమంగా వోల్టేజి తగ్గి, శవంకోసం ఏడ్చే ఏడుపులా సాగదీయబడి భయం గొలుపుతూ ఉంది.

పక్క టేబుల్ నుంచి పెద్దపెద్ద శబ్దాలు. వాళ్ల కబుర్లు పెద్దగా గరగర శబ్దాల్లా వినిపిస్తున్నాయి. ''వైయాగ్రా గురించి మీ ఒపీనియనేమిటి?'' ''ఈ శతాబ్దంలోనే గొప్ప డిస్కవరీ! చంకలు బాదుకొనే ఫెమినిస్టులకు వైయాగ్రానే సమాధానం!''

కోపంగా అటువైపు చూసి ఉలిక్కిపడ్డాను. టేబుల్‌పై ఉన్నది మనుషులు కాదు. పాంటు, షర్టు వేసుకొన్న దున్న. పక్కనే చీర కట్టుకున్న బర్రె. నిక్కరు, చొక్కాలు వేసుకొన్న దూడలు. ద బఫెల్లోస్ ఫ్యామిలీ!

నా నోటమాట రాలేదు. హెల్యూజినేషనేమో అనిపించింది. ఉహు కాదు. ఎదురుగా మాలతి కూర్చునే ఉంది మౌనంగా. గొప్ప ఆలోచనలలో ఉంది. 'మాలతీ! చూశావా ఈ వింత!' అని అరవాలనిపించింది. నోట మాట రాలేదు. ఖద్దరు పంచె, ధోవతీ కట్టుకొన్న రెండు బఫెల్లోలు విలాసంగా నడుచుకుంటూ నా ముందు సీట్లో కూలబడ్డాయి.

"వాట్ డు యు వాంట్!" పక్కటేబుల్ దగ్గర ఆర్డర్ తీసుకుంటున్నాడు వెయిటర్.

"మనిషి పెనిస్‌తో చేసిన సూప్ దొరుకుతుందా?"

"యస్ సర్! ఉయ్ హావ్! ఉడ్ యు లైక్ టు హావ్ టుడేస్ స్పెషల్ అమెరికన్ పెనిస్ సూప్! స్పెషల్లీ ఇంపోర్టెడ్ ఫ్రం స్టేట్స్!"

"ప్లీజ్ ఆర్డర్ ఇట్!"

నా గొంతులో తడి ఆరిపోయింది. బరువైన అడుగులతో మా వైపు వచ్చాడు స్టీవార్టు. "గుడ్ మార్నింగ్ సర్ అండ్ మేడమ్! వాట్ డు యు వాంట్!" అవి మాటల్లా లేవు గురగురమంటున్న శబ్దాల్లా ఉన్నాయి. తెల్లటి షర్ట్. పాంట్, నెక్‌టై, మినీ సూట్‌లో ట్రిమ్‌గా ఉందా బఫెల్లో.

హెల్యూజినేషన్! హెల్యూజినేషన్! ఇదంతా నాన్సెన్స్! మాలతీ! సమ్‌థింగ్ రాంగ్ విత్ మి!

"రెండు కప్పుల కాఫీ చెప్పు!" మాలతే ఆర్డర్ చెప్పింది.

"మేమ్! హేవ్ సమ్ హార్డ్ స్టఫ్! స్పెషల్ హ్యూమన్ బ్రెయిన్ మసాల ఉంది మాడమ్! మెత్తగా, టేస్టీగా, ట్రై ఒన్స్ మేమ్!"

"అవసరం లేదు. కాఫీ చాలు!" మాలతి విసుగ్గా చెప్పింది.

హఠాత్తుగా తుపాకీ పేలిన శబ్దం! సెంట్రీ యూనిఫారంలో ఉన్న బఫెల్లో హడావుడిగా అటూఇటూ తిరుగుతున్నాడు. "క్లోజ్ ద డోర్స్! క్లోజ్ ద షట్టర్స్! ది దళిత్ బఫెల్లోస్ ఆర్ కమింగ్!" పెద్దగా అరుస్తున్నాడా సెంట్రీ బఫెల్లో.

హాలులో అందరూ అలర్ట్ అయ్యారు. నా పక్కనున్న సూట్‌వాలా బఫెల్లో, ఖద్దరు బఫెల్లో తుపాకులు బయటకు తీశారు. "కిల్ దెమ్! ఒక్కటి కూడా మిగలడానికి వీల్లేదు!" ఖద్దరు బఫెల్లో భయంతో అరుస్తున్నాడు.

మాలతి నిర్లిప్తంగా చూస్తుంది. ఏమిటిది? ఇంత కూల్‌గా ఎట్లా ఉండగలుగుతుంది! హాలులో హడావుడిగా ఉంది. తలుపులన్నీ మూసివేశారు. లైట్లు ఆర్పివేశారు. టేబుళ్లపై కాండిల్స్ ఆర్పివేశారు.

తలుపులపై ధన్ ధన్‌మంటున్న చప్పుడు. ఫెడేల్‌మంటూ షట్టర్లు ఒక్కసారిగా విరిగాయి! నల్లగా, నిగనిగలాడుతూ అందంగా దళిత బఫెల్లో!

"అయ్యో ఇది సుబ్బమ్మగారి గేదె!" నేను ఎగ్జైటెడ్‌గా అరిచాను. తుపాకులు ధన్‌ధన్‌మంటూ పేలాయి. దాని శరీరంపై ఎర్ర ఎర్రగా బుల్లెట్ మరకలు. అది అట్లా నిర్భయంగా నడుస్తూనే ఉంది. తుపాకులు పారేసి పరుగులు అందుకున్నాయి మిగిలిన బఫెల్లోలు. వెంటాడి, వెంటాడి సూట్‌వాలా బఫెల్లోని, రాజకీయ బఫెల్లోని ముందుకాళ్లతో ఒక్క తన్ను తన్ని, నేలపై జారిన దానిపొట్టలో కొమ్ముల్తో ఒక పోటు పొడిచి- రక్తం ఎగజిమ్మింది! మూతిపై నున్న రక్తాన్ని తుడుచుకొని తాపీగా వచ్చి టేబుల్‌పై కూర్చుంది దళిత్ బఫెల్లో!

"మెదడు సూప్ పట్రా!" పెద్దగా అరుస్తుంది దళిత్ బఫెల్లో. "పొలిటీషియన్ల మెదళ్లు ఉన్నాయేమో చూడు!" ఆర్డర్ చేసి, సిగరెట్ తీసుకొని తాపీగా వెలిగించుకొని, అగ్గిపుల్ల పుగాకు బేళ్లపై విసిరింది.

మంటలు! మంటలు! ఎర్రగా నాలుకలు సాచి పుగాకు బేళ్లపై మంటలు! ఆహ్లాదంగా నవ్వుతూ ఆనందిస్తుంది దళిత బఫెల్లో!

దగ్గరగా వెళ్లి షేక్‌హాండ్ ఇద్దామని లేచాను. వద్దంటూ వెనక్కు లాగుతుంది మాలతి.

"రండి! మీకేదో పిచ్చిపట్టింది! ఎవరైనా చూస్తే ప్రాణాలు తీస్తారు!" మాలతి నన్ను భయంతో వెనక్కు లాగుతోంది! బఫెల్లో క్లబ్ దాటి, తారురోడ్డు దాటి, మళ్లీ పుగాకు పొలాల్లోకి పరిగెత్తి, పొలాల మధ్య కూలబడి.

"ఏమిటట్లా చేశారు! ఉన్మాదిలాగా ఆ పుగాకు బేళ్లకు నిప్పు పెట్టారు! ఇక ఆ మంట ఆరదు! లక్షల్లో నష్టం! ఎవరైనా చూస్తే మనల్ని చంపి అందులోకే విసిరేసే వాళ్లు!"

కొంత అర్థమయ్యీ, అర్థంకాక, కొంత నిజం, కొంత హెల్యూజినేషనూ-

*ఆదివారం ఆంధ్రజ్యోతి, 9 ఆగస్టు 1998*

